ప్రజాశక్తి
సోమవారం 9 డిసెంబరు 2024
5
శ్రీకాకుళం

సాంకేతికతతో నేరాలకు అడ్డుకట్ట

శ్రీకాకుళం : జిల్లాలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నేరాలను నియంత్రించడంలో భాగంగా డ్రోన్స్‌ను వినియోగిస్తున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా నేరాలు జరిగేందుకు ఆస్కారమున్న ప్రదేశాలను ముందుగా గుర్తించి, గంజాయి వినియోగం, ఇతరత్రా చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ ఉపకరిస్తాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని పలు నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచి, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యసనాల వల.. విలవిల

- ఆకర్షణలతో దారితప్పుతున్న టీనేజర్లు
- మొదట సరదాగా మారి.. ఆపై ప్రమాదపు అంచులోకి
- తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమంటున్న నిపుణులు

మత్తు.. జీవితం చిత్తు..

పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా పార్టీల సంస్కృతి పెరిగిపోతోంది. తొలుత స్నేహితుల ఒత్తిడితో ఒకసారి తాగితే తప్పు లేదులే అని భావించి మద్యపానం చేస్తున్నారు. ఆ తర్వాత అదే అలవాటుగా మారుతోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. మత్తులో మునిగితేలుతున్నారు. వివాహేతర సంబంధాలు పెట్టుకుంటున్నారు. జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం చోరీలు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారు.

పదో తరగతి, ఇంటర్‌లో 90 శాతానికి పైగా మార్కులు వచ్చాయి. ఎంసెట్‌లో మంచి ర్యాంకు రావడంతో పేరున్న ఇంజినీరింగ్ కళాశాలలో చేరాడు. మొదటి మూడు నెలలు కళాశాల కొత్త వాతావరణంలో బాగానే ఉన్నాడు. తర్వాత చేతికి ఫోన్ వచ్చింది. సమయం ఆదా అవుతుందని తల్లిదండ్రులు బైక్ కొనిచ్చారు. అంతే అక్కడ్నుంచి అతని జీవితంలో ఎంతగానో మార్పులు వచ్చాయి. రాత్రిళ్లు నిద్ర లేకుండా సెల్‌ఫోన్‌తో గడపడం, పగలు స్నేహితులతో గడపడం ఎక్కువైంది. పూర్తిగా వ్యసనాల అగాథంలో తమ కొడుకు చిక్కుకున్నాడన్న విషయాన్ని తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తించారు. మానసిక వైద్య నిపుణుల వద్దకు తీసుకెళ్లి కొడుకుని కాపాడుకున్నారు.

ప్రజాశక్తి - పలాస, శ్రీకాకుళం

ఎవరి జీవితంలోనైనా కౌమార దశ (టీనేజ్) ఎంతో కీలకమైంది. 13 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు వారిని టీనేజర్లుగా పరిగణిస్తారు. భవితకు పునాది వేసుకునేది ఆ వయసులోనే. ఆకర్షణలకు కూడా లోనయ్యేది ఆ వయసులోనే. స్వేచ్ఛగా కొత్త ప్రపంచంలోకి అడుగు పెడుతున్న అనుభూతి కలుగుతుంది. హార్మోన్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. స్నేహాలు, అలవాట్లకు త్వరగా ఆకర్షితులయ్యే అవకాశం ఉంది. ఏది మంచో, ఏది చెడో దగ్గరుండి పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతో ఉంటుంది. లేకుంటే పిల్లలు పెను ప్రమాదంలో చిక్కుకునే అవకాశం ఉంటుంది.

ర్యాగింగ్ వద్దే వద్దు

కళాశాలలో ర్యాగింగ్ సంస్కృతి చాప కింద నీరులా విస్తరించి ఉంది. జూనియర్లను ఏడిపించాలనో, సరదా కోసమో వేధింపులకు దిగితే ర్యాగింగ్ కేసులు నమోదై జైలు పాలవుతారు. టీనేజర్లు ఆకర్షణకు లోనై దానినే ప్రేమగా భావించి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ప్రేమించలేదని, మోసగించారని ప్రేమోన్మాదులుగా మారి దాడులకు పాల్పడుతున్నారు. కేసుల్లో చిక్కుకుని కటకటాల వెనుక ఊచలు లెక్కపెట్టాల్సి వస్తోంది.

తల్లిదండ్రులూ గమనించండి

- టీనేజీ వయసు పిల్లలు దారి తప్ప కుండా చూడాల్సిన బాధ్యత తల్లి దండ్రులపై ఎంతో ఉంది. పిల్లలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. అవసరానికి మించి డబ్బు ఇవ్వరాదు. ప్రవర్తనను ఎప్పుడూ గమనిస్తూ ఉండాలి. ప్రేమగా మాట్లాడుతూ చెడు మార్గం పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- చిన్నతనం నుంచే పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేలా కృషి చేయాలి. నిపుణులతో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, మంచి మార్గాన్ని ఎంచుకుని ముందుకు సాగితే జీవితం ఎంత బాగుంటుందో వివరించి చెప్పించాలి. ఫోన్‌ను సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన కల్పించాలి.
- కష్టపడి ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం ద్వారా స్ఫూర్తిదాయక విజయాలు సాధించిన వ్యక్తుల గురించి తెలియజేయాలి. సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. మంచి పుస్తకాలు చదవాలి.
- అనాలోచితంగా తెలిసీ తెలియక తప్పులు చేస్తే కలిగే నష్టంపై వివరించాలి. క్రమశిక్షణతో ఉండి బాగా చదివితే భవిష్యత్ ఎంత బాగుంటుందో చెప్పాలి. ఇష్టమైన క్రీడలు, కళల్లో శిక్షణ ఇప్పించి రాణించేలా ప్రోత్సహించాలి. ఓటమికి కుంగిపోకుండా మనోధైర్యాన్ని కల్పించాలి.

నైతిక విలువలు పెంపొందించాలి

విద్యార్థులను స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉంచితే చాలా మంచిది. వారు చెడిపోవడానికి ఇవే ఎక్కువగా కారణమవుతున్నాయి. తల్లిదండ్రులు పిల్లలను అతి గారాబం చేసి ఎక్కువ డబ్బులు ఇవ్వరాదు. వారి పోకడలు ఎప్పుడూ గమనిస్తూ ఉండాలి. ప్రవర్తనను పరిశీలించి దారి తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం అంధకారం అవుతుందన్న విషయాన్ని వివరించి చెప్పాలి. చిన్నతనం నుంచి నైతిక విలువలు పెంపొందించేలా చూడాలి.

- కె.రజని
వైస్ ఛాన్సలర్, బిఆర్‌ఎయు

మార్గదర్శకమే ముఖ్యం

పిల్లలు దారి తప్పకుండా మార్గదర్శకం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉంది. కళాశాలలో చేర్పించగానే తమ పని అయిపోయిందని భావించరాదు. కళాశాలకు వచ్చి అధ్యాపకులను కలిసి ఏ విధంగా చదువుతున్నారో తెలుసుకోవాలి. విద్యార్థుల నడవడికను ఎప్పుడూ గమనిస్తూ ఉండాలి. చెడు స్నేహాలు, తప్పుడు మార్గం పట్టకుండా చూడాలి.

- బెండి సాయిరాం
సైకాలజిస్టు, శ్రీకాకుళం

సెల్‌ఫోన్‌తో సర్వనాశనం

ఇంటర్, డిగ్రీ ఇంజినీరింగ్ కోర్సులు చదవడానికి ఇంటికి దూరంగా బయటకు వెళ్తున్నారు. తల్లిదండ్రులు, పెద్దల పర్యవేక్షణ తగ్గిపోతోంది. మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సౌకర్యం విస్తరించింది. స్మార్ట్‌ఫోన్‌లో వీడియోలు చూస్తూ, కాల్స్ చేస్తూ ఆటలు ఆడుతూ ఎక్కువ సమయాన్ని గడిపేస్తున్నారు. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల్లో మునిగిపోతున్నారు. పోర్న్‌సైట్లలో నీలి చిత్రాలు చూడటానికి అలవాటు పడుతున్నారు.

పరీక్షా కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి - టెక్కలి, శ్రీకాకుళం అర్బన్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) 2024-25కు సంబంధించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా సాగింది. జిల్లావ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. 3,456 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షను నిర్వహించారు. పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా 4,908మంది దరఖాస్తు చేసుకోగా, రాత పరీక్షకు 4,792 మంది హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 116 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. డిఇఒతో పాటు టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్‌తో పాటు మండల విద్యాశాఖాధికారులు పలు కేంద్రాలను పరిశీలించారు. నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు విద్యార్థులకు చేరుకున్నారు.

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను అధికారులు కల్పించారు. టెక్కలి డివిజన్‌లో పరీక్షా కేంద్రాల మంజూరుపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనాన్ని వ్యక్తం చేశారు. టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులకు పలాస-కాశీబుగ్గ పట్టణంలోని పరీక్షా కేంద్రాలు మంజూరు చేశారు. వజ్రపుకొత్తూరు, కంచిలి మండలాలకు చెందిన విద్యార్థులకు టెక్కలి కేంద్రం మంజూరు చేయడంతో అవస్థలకు గురయ్యారు. హిరమండలం మండలానికి సంబంధించిన పాఠశాలల విద్యార్థులను టెక్కలికి కేటాయించడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులు చదువుతున్న పాఠశాల నుంచి సుదూర ప్రాంతాల పరీక్షా కేంద్రాలకు కేటాయించడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పరీక్ష ప్రశ్నాపత్రంలో పొలిటికల్ సైన్స్ విభాగంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఎవరు, ఎకనమిక్స్ విభాగంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఎవరు అనే ప్రశ్నలు ఇచ్చారు.

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

సిక్కోలును క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతా..

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యాన క్రికెట్ మైదానం నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొంత భాగం క్రికెట్ మైదానం నిర్మాణానికి అంగీకరించడంపై అభినందనలు తెలిపారు. క్రీడల ఖిల్లాగా పేరు పొందిన శ్రీకాకుళం జిల్లాలో క్రీడలకు సరైన వసతులు లేకపోవడం బాధాకరమన్నారు. క్రీడలను ప్రోత్సహించాలని క్రికెట్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి మైదానాన్ని పూర్తి చేయాలని చెప్పారు. గతంలో మైదానం లేకపోవడంతో విశాఖపట్నం వెళ్లి శిక్షణ పొందాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. క్రీడాకారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కోడి రామ్మూర్తి స్టేడియంలో అథ్లెటిక్స్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌తో పాటు క్రికెట్ మైదానం, కళింగపట్నంలో క్రికెట్ మైదానం, ఇంటర్నేషనల్ స్టేడియం ఎనిమిది ఎకరాల్లో నిర్మించనున్నామని చెప్పారు. పాత్రునివలసలోనూ మైదానాలను సిద్ధం చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 75 యార్డ్స్ మేర క్రికెట్ మైదానం నిర్మాణానికి ఎంఒయు చేసుకున్నామని జిల్లా క్రికెట్ సంఘం మెంటార్ ఇలియాస్ అహ్మద్ తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిధులతో మూడు నెలల వ్యవధిలో యుద్ధప్రాతిపదికన సుందరమైన, సౌకర్యవంతమైన క్రీడా మైదానాన్ని నిర్మిస్తామని చెప్పారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, సిఇసి కమిటీ సమావేశంలో ఎంఒయు కుదుర్చుకోవడంలో ఎమ్మెల్యే శంకర్ పూర్తి సహకారాన్ని అందించారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పుల్లెల శాస్త్రి, సెక్రటరీ హసన్‌రాజా, కోశాధికారి షైలానీ, కోచ్ సుదర్శన్, అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు వండాన మురళీమోహన్, భద్రగిరి మురళీధర్‌కుమార్, బాబు, వి.వి.ఆర్.ఎస్ మూర్తి, మనోహర్ పసుమర్తి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

ప్రజాశక్తి - బూర్జ

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కొల్లివలసలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను నరికేయడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతిందన్నారు. వాయు కాలుష్యం పెరగడం వల్ల అనారోగ్యాలకు దారిస్తోందని తెలిపారు. సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 21 శాతం మాత్రమే పచ్చదనం ఉందని మొక్కలు నాటే కార్యక్రమంతో 50 శాతానికి పెంచుకోవాలన్నారు. పుట్టినరోజు, పెళ్లిరోజు తదితర కార్యక్రమాలకు మొక్కలు నాటాలన్నారు. కూటమి ప్రభుత్వం పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. జనవరి నెలాఖరులోగా రహదారుల మరమ్మతులను పూర్తి చేస్తామని చెప్పారు. ప్రతి గ్రామానికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, వైస్ ఎంపిపి బొడ్డేపల్లి సూర్యారావు, టిడిపి మండల అధ్యక్షులు రామ్‌జీ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎస్.సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన రైల్వే అభివృద్ధి పనులు

- సంక్రాంతికి శ్రీకాకుళం నుంచి ప్రత్యేక రైళ్లు నడపాలి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా సమగ్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే రైల్వే పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. పలు స్టేషన్లలో అభివృద్ధి పనులతో పాటు కొత్త రైళ్లను కేటాయించాలని సూచించారు. వాల్తేరు ఎడిఆర్ఎం మనోజ్ సాహు అధ్యక్షతన సీనియర్ డిఇఎన్ వెంకటరమణ పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించిన డివిజనల్ రైల్వే సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్ భారత్ పథకంలో ఎంపికైన శ్రీకాకుళం రోడ్డు, పలాస, ఇచ్ఛాపురం, నౌపడ రైల్వేస్టేషన్లలో జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో జిల్లా ప్రత్యేకతను తెలియజేసేలా అరసవల్లి సూర్య దేవాలయం ఆకృతి నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఇక్కడ నాలుగు ప్లాట్‌ఫారాలు మాత్రమే ఉన్నాయని, దీన్ని ఆరుకి విస్తరించడంతో పాటు రెండు వైపుల నుంచి రాకపోకలు సాగించేలా విస్తరణ పనులు చేపట్టాలన్నారు. ఉర్లాం స్టేషన్ అభివృద్ధి, కామేశ్వరిపేటలో పాసింజర్ హాల్టు కల్పించడంతో పాటు మెమూ రైళ్లను నిలుపుదల పునరుద్ధరించాలన్నారు. కోటబొమ్మాళి, పూండీలో భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలోని నౌపడ నుంచి ఒడిశాలోని గుణుపూర్ మధ్య ఉన్న సింగిల్ లైన్‌లో మరిన్ని రైళ్ల రాకపోకలు చేసేలా తెంబూరు, కాశీనగర్‌లో క్రాసింగ్ సౌకర్యం కల్పించాలని కేంద్ర మంత్రి సూచించారు. టెక్కలి, పాతపట్నం స్టేషన్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నౌపడలో కొత్త ఎఫ్‌ఒబి, ప్రయాణికుల వెయిటింగ్ షెడ్లు, పూండిలో ఎఫ్‌ఒబి, హరిశ్చంద్రపురంలో ప్రయాణికుల భవనం, కొత్త రోడ్లు.. రౌతుపురంలో ప్లాట్‌ఫారం పనులు పూర్తి చేయడంతో పాటు వేగవంతంగా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు.

మ్యాపును పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

దూసిలో గాంధీ స్మారకం

ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వేలాది మంది వలస కార్మికులు సంక్రాంతికి స్వస్థలాలకు చేరుకుంటారని చెప్పారు. రద్దీకి అనుగుణంగా జనవరి 10, 11, 12 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి, 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం నుంచి ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు. దేశ స్వాతంత్ర్య పోరాటం, చారిత్రక నేపథ్యం ఉన్న దూసి రైల్వేస్టేషన్‌కు జాతిపిత మహాత్మాగాంధీ వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో గాంధీ స్మారక భవన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన వాల్తేర్ డివిజనల్ అధికారులు.. ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

నౌపడ : భావనపాడు తీరానికి వచ్చిన పర్యాటకులు

పర్యాటక ప్రదేశాల్లో పిక్నిక్ సందడి

ప్రజాశక్తి - నౌపడ, వజ్రపుకొత్తూరు, పోలాకి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. పర్యాటక, సందర్శనీయ, ఆధ్యాత్మిక ప్రదేశాలకు కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులతో కలిసి వెళ్లి వన భోజనాలు, వినోద కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. సంతబొమ్మాళి మండలం భావనపాడు, వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, పోలాకి మండలం రాజారాంపురం, సోంపేట మండలం బారువ తదితర సముద్ర తీరాలు పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి విహారయాత్రకు వచ్చిన జనంతో సముద్ర తీరాలు కిక్కిరిసిపోయాయి. జిల్లా నలుమూలల నుంచి, ఒడిశా నుంచి వాహనాలతో పర్యాటకులు రావడంతో భావనపాడు, బారువ ప్రాంతం రద్దీగా మారింది.

ఉరుకులు, పరుగులతో కాలం గడుపుతున్న జనం కాసేపు అన్ని మర్చిపోయి ఆహ్లాదంగా గడిపారు. సరుగుడు తోటలు, జీడి తోటల్లో సేదతీరి సముద్రంలో స్నానం చేస్తూ కేరింతలు కొట్టారు. పలువురు యాత్రికులు ఏర్పాటు చేసిన సౌండ్ సిస్టమ్ వద్ద పాటలకు నృత్యాలు వేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భావనపాడులో నౌపడ ఎస్ఐ నారాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, బావనపాడు మెరైన్ పోలీస్ సిబ్బంది, పోలాకి మండలంలో ఎస్ఐ జి.రంజిత్ ఆధ్వర్యాన పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

మెటీరియల్ కాంపోనెంట్ పనులు వేగవంతం

- 437 సిమెంట్ రోడ్లకు కాంక్రీట్ పనుల మంజూరు
- బిల్లులు సకాలంలో అప్‌లోడ్ చేస్తే తక్షణ చెల్లింపులు
- డ్వామా పీడీ బి.సుధాకరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉపాధి హామీ అమల్లో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.సుధాకరరావు తెలిపారు. సంక్రాంతి నాటికి పల్లెల్లో కొత్త సిమెంట్ రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఫిష్ పాండ్స్, ఫారం పాండ్స్, ఇల్లు, కార్యాలయాల పైకప్పు నుంచి వచ్చే నీటిని ఒడిసిపట్టేందుకు వీలుగా ఇంకుడుగుంతలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పెర్కులేషన్ ట్యాంకులు, గోకులాలు, వ్యక్తిగత ఇంకుడుగుంతలు తదితర పనులు చేపడుతున్నట్లు వివరించారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

జిల్లాలో మెటీరియల్ కాంపోనెంట్ పనులు ఎలా సాగుతున్నాయి?

జిల్లావ్యాప్తంగా 3303 సిమెంట్ రోడ్లకు గానూ 437 సిమెంట్ కాంక్రీట్ కాలువల పనులు ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో మంజూరు చేశాం. ఇందుకోసం రూ.276.54 కోట్లు మంజూరు చేయడమైంది. గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం పనులు 90 శాతం వరకు మొదలుపెట్టాం. మిగిలిన పది శాతం పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. సంక్రాంతి నాటికి పల్లెల్లో కొత్త సిమెంట్ రోడ్లు వేయడానికి కృషి చేస్తున్నాం. నాణ్యతా ప్రమాణాలతో ఇంజినీరింగ్ అధికారులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

గోకులాల నిర్మాణం ఎలా సాగుతోంది?

జిల్లావ్యాప్తంగా సుమారు 285 కాటిల్‌షెడ్స్ మంజూరు చేయడమైంది. ఒక్కో షెడ్డుకు 3, 5, 8 పశువులను పెంచుకునేందుకు వీలుగా మూడు కేటగిరీల్లో వాటి నిర్మాణం జరుగుతోంది. సుమారు రూ.2.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించుకునేందుకు వీలుంటుంది. దీనివల్ల పాడి రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. వీటితోపాటు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న చేపల చెరువుల్లో చేపలు పెంచుకునేందుకు వీలుగా ఫిష్ పాండ్స్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చాం. ఫారం పాండ్స్, ఇల్లు లేదా కార్యాలయాల పైకప్పు నుంచి వచ్చే నీటిని ఒడిసి పట్టేందుకు వీలుగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నాం.

సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయా?

ఉపాధి హామీ పనులకు నిధుల కొరత లేదు. సకాలంలో పనులు పూర్తి చేస్తే తక్షణమే చెల్లింపులు జరుగుతాయి. ప్రారంభించిన ప్రతి పని వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. సకాలంలో వాటిని పంపించడం వల్ల చెల్లింపులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రతి గురువారం పనులు చేసిన మేరకు బిల్లులు నమోదు చేసి శుక్రవారం నాటికి చెల్లింపులు చేస్తున్నాం. అందువల్ల పనులను పూర్తి చేయడంతో పాటు ఎంబుక్ నమోదు, బిల్లులు అప్‌లోడ్ చేయడం సకాలంలో జరగాలి. అప్పుడే చెల్లింపులకు వీలుంటుంది.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పన ఏమేరకు చేపడుతున్నారు?

పేదల ఇళ్ల కాలనీ లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు గతంలో కొన్ని మంజూరై ఉన్నాయి. సిమెంట్ రోడ్లతో పాటు కాలువల నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు ఇచ్చాం. ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈపనులకు మెటీరియల్ అందుబాటులో లేని కారణంగా గతంలో పూర్తి చేయలేకపోయామని పర్యవేక్షకులు చెప్పడంతో, ఇప్పుడు అన్నిచోట్లా అవసరమైన మేరకు మెటీరియల్ అందుబాటులో ఉంచాం. పనులు పూర్తి చేయడం ద్వారా మౌలిక వసతులు సమకూర్చుకునేందుకు వీలుంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

తాగునీటి పథకానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గార మండలం సాలిహుండంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం నిధులతో మంజూరు చేసిన రక్షిత తాగునీటి పథకాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు గ్రామాన్ని సందర్శించిన ప్రజలతో మాట్లాడారు. వంశధార నది ఒడ్డునే ఉన్నా గ్రామంలో తాగునీటి ఎద్దడిని ఏటా ఎదుర్కొంటున్నారని, గత కొన్నేళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో నీటి కోసం దూర ప్రాంతానికి వెళ్లి తెలచ్చుకోవాల్సి వచ్చేదన్నారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఈ పథకాన్ని మంజూరు చేసినట్టు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి రానున్న వేసవిలో గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, టిడిపి నాయకులు గుండ భాస్కరరావు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ఘనంగా ఎమ్మెల్యే తనయుని నిశ్చితార్థం

పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు డాక్టర్ మామిడి సాయి గణేష్, దుర్గావైష్ణవి నిశ్చితార్థ వేడుకలు విశాఖపట్నంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొని ఆశీర్వదించారు.

చెస్ శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలిలో చెస్ శిక్షణా కేంద్రాన్ని జాతీయ చెస్ ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యులు రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు ఆదివారం ప్రారంభించారు.

శిక్షణ ఇస్తున్న భీమారావు

ఎంతోమంది ఇంటర్నేషనల్ క్రీడాకారులను తీర్చిదిద్దిన భీమారావు స్వయంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో శిక్షణ ఇస్తారు. ఈ అవకాశాన్ని టెక్కలి, పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని భీమారావు కోరారు. వారానికి మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆకుల గౌరి, ఎస్ఎస్ మార్ట్ అధినేత శ్రీను, ఇంటర్నేషనల్ రేటెడ్ ప్లేయర్ చలపతి, అకాడమీ డైరెక్టర్ అరుణకుమారి సహకరిస్తారని అన్నారు. ఆసక్తిగల వారు 9912559735 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

సున్నాడలో దాహం కేకలు

- సరఫరా కాని తాగునీరు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం
- రూ.లక్షల వ్యయం వృథా

ప్రజాశక్తి- పలాస

ఆ గ్రామానికి తాగునీటి కష్టాలు తప్పడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి తాగునీటి పథకాలు ఏర్పాటు చేసిన ఫలితం శూన్యం. గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రామంలో తాగునీటి ట్యాంకు, కుళాయిలు వేసినా గ్రామస్తులకు తిప్పలు తప్పడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అని చందంగా తయారైంది ఆ గ్రామస్తులకు.

మండలంలోని సున్నాడలో సుమారు 325 నివాస గృహాలు ఉండగా, సుమారు 1200 మంది జనాభా నివసిస్తున్నారు. ఆ గ్రామంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుంది. వేసవి సమీపించిందంటే తాగునీటి తిప్పలు తప్పవు. సమీప వ్యవసాయ బావల్లో నీరు తెచ్చుకొనే పరిస్థితి.

నీటి ట్యాంకు, కుళాయిలు ఉన్నా...

సున్నాడలో నీటికి కష్టాలు పడుతున్నారని అధికారులు గుర్తించి సుమారు పన్నెండు ఏళ్ల క్రితం మండల

చుక్కనీరు రాని ఇంటింటి కుళాయి (ఇన్‌సెట్‌లో నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంకు)

పరిషత్ నిధులతో బ్యాంకులతో నీటి సరఫరా చేసేవారు. దివంగత నేత మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు ఆ గ్రామస్తులు విన్నపం మేరకు సుమారు రూ.3.50 లక్షల వ్యయంతో మంచి నీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. అప్పటికి వారి సమస్య పరిష్కారం కాకపోవడంతో మరలా రూ.16 లక్షల వ్యయంతో తాగునీటి ట్యాంకు, వీధుల్లో పైపులైన్ వేసి తాగునీటిని సరఫరా చేశారు. ఆ పథకం మూడనాళ్ల ముచ్చటగా తయారైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు హయాంలో రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన జలజీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఇంటింటికి పైపులైన్ వేశారు. ఒక్కరోజు సరఫరా అయితే పదిహేను రోజులు నీరు వచ్చే పరిస్థితి ఉండదని గ్రామస్తులు చెబుతున్నారు.

పట్టించుకోని ప్రాజెక్టు అధికారులు

సున్నాడకు నీటి సమస్య ఎప్పటికీ పరిష్కారం కావడం లేదు. అధికారుల మాత్రం నీరు సరఫరా చేస్తున్నామని చెబుతున్నారే తప్ప నీరు సరఫరా కావడం లేదు. నీరు సరఫరా కావడం లేదని పదేపదే జలజీవన్ మిషన్ ప్రాజెక్టు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వీధికి నీరు సరఫరా అయితే మరో వీధికి నీరు సరఫరా కావడం లేదని, నీరు ఎప్పుడు ఇస్తారో? ఎప్పుడు సరఫరా అవుతుందో తెలియని పరిస్థితి. ఇటీవల గత ఇరవై రోజులుగా నీరు సరఫరా కావడం లేదని అధికారులకు చెబుతున్నా... పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఏదేమైనప్పటికీ గ్రామానికి రూ.లక్షల వ్యయంతో పనులు చేపట్టిన ఉత్సవ విగ్రహంలా దర్శనం ఇస్తున్నాయే తప్ప ప్రజలకు ఉపయోగ పడడంలేదు. దీంతో ప్రభుత్వ ధనం నిరుపయోగం అవుతుంది. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి గ్రామానికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయంపై జల జీవన్ మిషన్ ప్రాజెక్టు ఎఇ నిరంజన్ బొట్టుకు వివరణ కోరగా, జల జీవన్ మిషన్ ప్రాజెక్టు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. రాజగోపాలపురం వద్ద పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా చేయలేదన్నారు. మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు.

సురేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- లావేరు

లావేరు మండల టిడిపి అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు ముప్పిడి సురేష్ 49వ జన్మదిన వేడుకలు నిరాడంబరంగా నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని తాళ్లవలసలో ఆయన స్వగృహంలో టిడిపి నాయకులు, అధికారుల మధ్య ఆదివారం కేక్ కోసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పులబొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులు సురేష్‌కు ఫోన్లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తన క్యాంప్ కార్యాలయంలో సురేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పి.మధుబాబు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యద్శులు, విఆర్‌ఒలు కూడా జన్మదిన శుభాకాంక్షులు తెలిపారు.

సురేష్‌కు కేకు తినిపిస్తున్న అభిమానులు

సొంతింటి కల నెరవేరేనా?

ప్రజాశక్తి- బూర్జ

కూటమి ప్రభుత్వం పేదవాడి సొంతింటి పేదవారి కళ నెరవేరేనా? అని బాధితులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముందుగా పేదవాడికి సొంత ఇంటి కలను నిజం చేస్తామని హామీనిచ్చింది. గతంలో టిడిపి ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన ఎన్‌టిఆర్ గృహాలు నియోజకవర్గంలో ఎంతో మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోలేకపోయారు. గత వైసిపి ప్రభుత్వం ఆ గృహాల నిర్మాణం పూర్తి చేసేందుకు సహకారం అందించకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశ ఎదురైంది. వైసిపి ప్రభుత్వం హయాంలో ఆర్భాటంగా జగనన్న గృహాలకు శంకుస్థాపన చేసింది. అయితే ఎక్కడా పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రస్తుత ప్రభుత్వం మిగిలిపోయిన గృహాలనూ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

మార్చి 31 వరకు గడువు

టిడిపి హయాంలో మండలంలోని 1040 గృహాలు ఉన్నాయి. ఆమదాలవలస మండలంలలో 780, పొందూరు 1094, సరుబుజ్జిలిలో 784 గృహాలు ఉన్నాయి. వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలని సూచించారు. అయితే ఈ పథకం ద్వారా మార్చి 31 లోపు గడువు నిర్దేశించింది. గృహ నిర్మాణాలకు సకాలంలో నగదు అందజేస్తామని చెబుతున్నారు. అలాగే గత ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తికాని వారికీ మరో అవకాశం కల్పించింది. అయితే వీరందరూ తమ గృర్మాణాలు మార్చి 31 లోపల మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది.

కొత్త వారికీ...

సొంత స్థలం కలిగిన వారు, కొత్త గృహాలు కావాల్సిన వారూ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరుపున రూ.2.50 లక్షలు అందజేస్తుంది. ఇందులో వందల మంది తమ సొంత ఇంటి కలను చేసుకోగలుగుతారని ఆశతో ఉన్నారు.

షేక్ షబ్బీర్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ఫరీద్‌పేట పంచాయతీ కొయిరాల సమీపంలో ఆదివారం సర్వీస్ రోడ్డులోకి ఓ లారీ దూసుకొచ్చి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ షేక్ షబ్బీర్ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొయంబత్తూరు నుంచి కొబ్బరి బొండాలను ఝార్ఖండ్ రాష్ట్రానికి లారీలో తీసుకెళ్తున్నారు. కొయిరాల కూడలికి వచ్చేసరికి లారీ అదుపు తప్పి జాతీయ రహదారిపై నుంచి డివైడర్ ఢీకొని ఐరన్ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. లారీ డ్రైవర్ నిద్ర మత్తు వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రవికుమార్ మృతదేహం

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

టెక్కలి రూరల్ : టెక్కలి జాతీయ రహదారిపై లచ్చన్నపేట సమీపంలో ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. మృతుడు టెక్కలి నుంచి పలాస వైపు ద్విచక్ర వాహనంపై వెళున్నాడు. లచ్చన్నపేట వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పలాస మండల నారాయణపురానికి చెందిన పిట్టా రవికుమార్ (32) అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించిన అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సిఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఝాన్సీ, ఏడాదిన్న బాబు, తల్లిదండ్రులు గంగమ్మ, రామదాసు ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గాయపడిన క్షతగాత్రులు

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

సోంపేట: మండలంలోని కొర్లాం సమీపం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురుగా వెళ్తున్న లారీను వెనుక నుంచి బొలెరో లగేజీ వ్యాన్ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్, క్లీనర్ క్యాబిన్‌లో ఇరుక్కొని తీవ్ర గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో బారువా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలోని బేసి రామచంద్రాపురం కూడలి సమీప జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు నేషనల్ హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సోంపేట ప్రభుతాస్పత్రికి తరలించారు.

దగ్ధమైన షాపు

దుకాణం దగ్ధం

రణస్థలం రూరల్ : మండలంలోని తెప్పలవలస పంచాయతీ సీతారాంపురంలో శనివారం వేకువజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అరసవల్లి సత్యనారాయణకు చెందిన కార్పెంటరీ షాపు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గృహాల ప్రవేశాలకు ఉంచిన తలుపులు, ద్వారాలు, మిషనరీ కాలిపోయాయి. సమాచారం అందుకున్న విఆర్‌ఒ రామస్వామి పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం వాల్లిందని తెలిపారు. మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, వైస్ సర్పంచ్ లంక సీతారాములు బాధితుడిని పరామర్శించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

డిజిటల్ కోచ్ బోర్డుల ఏర్పాటు

కవిటి: లారెన్స్ ఇంజినీరింగ్ సంస్థ ఆధ్వర్యాన సోంపేట రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ డిజిటల్ కోచ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న పనులను జెడ్‌ఆర్‌యుసిసి మెంబరు శ్రీనివాస రంగా రౌలో శనివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ కోచ్ బోర్డులు ఏర్పాటు చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లోల్ల సూర్యనారాయణ, సాహుకారి తిరుపతి, వూన రవికుమార్, స్టేషన్ మాస్టర్ బెహరా పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

దుస్తుల పంపిణీ

దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గార మండలం కొంక్యానపేటలో కొన్నా చిన్నారావు, చిన్నమ్మడు దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆదివారం అన్నదానం, దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని పేదలకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 2007 నుంచి ఏటా చేపడుతున్న ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వృద్ధాశ్రమాలకు తరలిస్తున్న తరుణంతో అంకితభావంతో కొన్నా వాసు, మధుసూధనరావులు చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సాలిహుండం సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, ఎంపిటిసి గుండ భాస్కరరావు, జెడ్‌పి వైస్ మాజీ చైర్మన్ మార్పు ధర్మారావు, ఎఎంసి మాజీ చైర్మన్ పీస రమణమూర్తి, పూడి తిరుపతిరావు, పూడి బాలాదిత్య పాల్గొన్నారు.

కృష్ణారావు పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గడవ కౌసిక్ కుటుంబ సభ్యులను డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్‌లు ఆదివారం పరామర్శించారు. ఆయన స్వగృహాన్ని సందర్శించి కుంబసభ్యులను ఓదార్చారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి

పరామర్శిస్తున్న కృష్ణారావు

నివాళ్లర్పించారు. ఆయన మామ లంక గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లంక బాబాజీనాయుడులను కలుసుకున్నారు. వారితో పాటు పార్టీ నాయకులు అంబటి లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

బీల పొలంలో నీరు తీస్తున్న రైతు


ఫలించని పొగురుతీత ప్రయత్నం

బీల రైతు బేలచూపులు

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల కురిసిన వర్షం బీల రైతులు బేలా చూపులు చూసేలా చేస్తోంది. పొలాల్లో ఉన్న నీటిని మళ్లించేందుకు చందాలు వేసుకుని రెండు రోజులుగా పుటియాదల రైతులు చేసిన పొగురు తీత ప్రయత్నం విఫలమైంది. దీనికి తోడు ఆదివారం ఆకాశం మేఘావృతమై వర్ష సూచనలు కనిపించడంతో రైతులో ఆందోళన అధికమైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట దక్కించుకుందుకు రైతులు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. పొగురు పారితేనే పంట దక్కుతుందని, ఈలోగా మళ్లీ వర్షం పడితే పంట మొత్తం పోతుందని బీల రైతులు బేలగా చెబుతున్నారు.

పోరాటాలకు సిద్ధం

ప్రజాశక్తి- మందస

ఉద్దానం తీరప్రాంత భూ పరిరక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని ఉద్దానం తీర ప్రాంత భూ పరిరక్షణ కమిటీ నాయకులు బత్తిని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మండలంలోని బిడిమిలో కన్వీనర్ కొమర వాసు నేతృత్వంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లని ఎయిర్‌పోర్టు భూ బాధిత కుటుంబాలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెజార్టీ భూ బాధిత రైతులు మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అందరమూ ఏకమై ప్రతీ గ్రామం నుంచి నష్టపోతున్న రైతులు తరుపున ఒక కమిటీ ఏర్పాటు చేసి భవిష్యత్‌లో పోరాటం చేసేందుకు

మాట్లాడుతున్న కమిటీ నాయకులు

సిద్ధంగా కావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సంబంధం లేకుండా నిర్మించనున్న కార్గో ఎయిర్‌పోర్టుతో అభివృద్ధి అనగలమా? అని ప్రశ్నించారు. మనందరిదీ ఒకటే మాట... ఒకటే పోరాటం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్టి ధర్మారావు, ఎంపిటిసి తిర్రి రాజారావు, బాధిత రైతులు చిత్త కూర్మరావు, చిత్త గున్నయ్య, దున్న రామారావు, తామాడ తుంభనాథం, గుంటు లోకనాథం పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్ట

అభివృద్ధికి నోచుకోని కంచిలి ప్రభుత్వ కళాశాల

ప్రజాశక్తి- కంచిలి

ప్రభుత్వ విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నామంటూ పాలకులు చెబుతున్న మాటలకు ఆచరణలో వారు చూపిస్తున్న చిత్తశుద్ధికి పొంతన ఉండదన్న మాటలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది కంచిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుర్కొంటున్న దుస్థితి. ఉన్న గదులు విద్యాబోధనకు చాలకపోగా, సరైన సౌకర్యాలు కల్పనకు నోచుకోక అభివృద్ధికి ఆమలదూరంలో నిలిచిపోయింది.

కంచిలి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం 230 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, తెలుగు, ఇంగ్లీష్, ఒరియా మాధ్యమాల్లో నాలుగు గ్రూపులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల బోధనకు సరిపడ తరగతి గదులు లేకపోగా, ఉన్న గదుల్లో వారికి బోధనతోపాటు సైన్సు విద్యార్థులకు ప్రయోగాలు

వేధిస్తున్న వసతి

నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఉన్న భవనంలో కేవలం ఎనిమిది గదులు మాత్రమే ఉండటంతో ఒక గదిని ఆఫీస్ కార్యకలాపాలకు, ప్రిన్సిపాల్ రూమ్‌గా వాడుక చేస్తుండగా, ఇంకొక గదిని సైన్సు ల్యాబ్‌గా ఉపయోగిస్తున్నారు. మిగిలిన ఆరు గదుల్లోనే అందరు విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నారు. కళాశాలలో విద్యార్థుల కోసం అదనపు గదుల నిర్మాణానికి పునాదులు వేసినా, సంవత్సరాలుగా అది పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం భోజనాలు చేసేందుకు విద్యార్థులు సమీపంలోని చెట్ల నీడలకు, పక్క వీధిలో ఇళ్ల వద్దకు చేరి ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నిరుపేద విద్యార్థులు ఎక్కువ శాతం చదివే కంచిలి ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు కోరుతున్నారు.

పరిసర ప్రాంత విద్యార్థులందరికీ ఈ కళాశాలే శరణ్యం

కంచిలి మండల కేంద్రంతోపాటు మండల శివార్లలోని జలంత్రకోట, జె.మాణిక్యపురం, ముండల, ఎక్కల, అర్జునాపురం, ఘాటి, రేఖాదేవిపురం, జిల్లుండ గ్రామాలు, కవిటి

అదనపు భవనాల కోసం వేసిన పునాదులు

మండలంలోని బైరాగిపుట్టుగ, మెళియాపుట్టుగ, కొన్నాయిపుట్టుగ, జమేదారుపుట్టుగ, బెలగాం, సహలాలపుట్టుగ తదితర గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులంతా కంచిలి ప్రభుత్వ కళాశాలలోనే విద్యాభ్యాసం చేస్తుంటారు. ప్రయివేటు కళాశాలల్లో చదివించేందుకు ఆర్థిక స్తోమత లేక, అనేక ఇబ్బందులు పడుతూ వచ్చే విద్యార్థులకు కళాశాలలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీనికితోడు కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో తరగతులు నిర్వహిస్తుండగా... పశువులు, కుక్కలు ఆవరణలోకి వచేస్తున్నాయి. వాహన చోదకులు సైతం ఇదే దారి నుంచి జాతీయ రహదారికి వెళ్తుంటారు. దీంతో విద్యార్థుల బోధనకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులకు ప్రతిపాదనలు పంపించామని చెప్పడమే తప్ప, కళాశాల అభివృద్ధికి ఎవరూ ఏమి చేసిందేమి లేదన్న విమర్శలు మాత్రం జోరుగా వినిపిస్తున్నాయి.

అంధ ఉద్యోగుల సంఘం ఎన్నిక

శ్రీకాకుళం: నగరంలోని క్లాస్-4 ఉద్యోగుల భవనంలో ఆదివారం అంధ ఉద్యోగుల సంఘం నాయకులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిసిటిఒ, రాష్ట్ర అంధ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రవీంద్రబాబు అధ్యక్షత వహించారు. అంధ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా కె.అప్పలనాయుడు (అగ్రికల్చర్, నరసన్నపేట), అసోసియేట్ అధ్యక్షులుగా పి.త్రినాథరావు (శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాల), జనరల్ సెక్రటరీగా పి.గణపతి (కమర్షియల్ ట్యాక్స్, ఆమదాలవలస), ట్రెజరర్‌గా

సన్మానిస్తున్న రవీంద్రబాబు

జి.రవీంద్ర (లేబర్ ఆఫీస్), మహిళా అధ్యక్షులుగా ఎల్.జ్యోత్స్న (ల్యాండ్ సర్వేయర్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.శ్రీనివాస్ (డిపిఆర్‌ఒ, శ్రీకాకుళం), వైస్ ప్రెసిడెంట్లుగా బి.శ్రీను (సొసైటీ వెల్ఫేర్), బి.శ్రీనివాస్ (హెల్త్), జాయింట్ సెక్రటరీలుగా కె.మంజుల కుమారి (ఇరిగేషన్), ఎ.రవణమ్మ (ఎంపిడిఒ కార్యాలయం, శ్రీకాకుళం)లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నాయకులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పాతపట్నం

ఈ నెల 14న పాతపట్నం మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కోట కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం కేసులో పట్టుబడిన నిందితులు ఈ లోక్ అదాలత్‌లో అపరాధ రుసుం చెల్లించి వారిపై ఉన్న కేసులను తొలగించుకోవచ్చు నని సూచించారు. ఈయనతో పాటు ఎస్ఐ బి.శ్రీనివాసరావు ఉన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి- పాతపట్నం

జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పాతపట్నం ఎస్ఐ బి.లావణ్య తన సిబ్బందితో కలిసి ఆదివారం పాతపట్నం చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన వాహనాలన్నీ నిశితంగా పరిశీలించారు. అనంతరం పాతపట్నం టౌన్, కాగువాడ, కోరసవాడ గ్రామాల్లో కిరాణా షాపుల్లో కెనైన్ నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహకారంతో గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు గురించి తనిఖీ నిర్వహించారు. ఎవరైనా అక్రమంగా తరలించినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని గ్రామాల్లో ఎవరైనా మత్తు, గంజాయి, పొగాకు ఉత్పత్తులు విక్రయించినట్లయితే పాతపట్నం పోలీసు వారికి సమాచారం అందించాలని తెలిపారు.

బూర్జ : మండలంలో లచ్చయ్యపేట కూడలి వద్ద సంకల్పం అనే కార్యక్రమాన్ని ఎస్ఐ ప్రవల్లిక అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు

పాతపట్నం : డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న ఎస్ఐ లావణ్య

బానిసలై తమ బంగారు భవిష్యత్‌ని నాశనం చేసుకోవద్దని సూచించారు. నలుగురికీ ఆదర్శంగా ఉంటూ సమాజానికి మేలు చేయాలన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పలుచోట్ల పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో వాహనాలను, దుకాణాల్లో ఎస్ఐ పి.రమేష్‌బాబు, పోలీస్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు.